జాతీయ లోక్ అదాలత్ ను వినియోగించుకోండి ...

విశాలాంధ్ర-టెక్కలి: మండల కేంద్రంలో స్థానిక కోర్ట్ ఆవరణలో సెప్టెంబర్ 14వ తేదీన ఉదయం 10.30 నిమిషాలకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరించబడునని, ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని, రాజీయే రాజమార్గమని, రాజీకి వీలైనన్ని ఎక్కువ కేసులను లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవాలని, లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని తెలిపారు. అలాగే లోక్ అదాలత్ లో సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు కూడా వాపసు ఇవ్వబడుతున్నట్లు తెలిపారు.

హాస్టల్స్‌లో బయట ఆహారాన్ని అనుమతించొద్దు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లాలో నడుపుతున్న హాస్టల్స్ కు బయటి నుండి ఆహారం అనుమతించకూడదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ వసతీ గృహాలు, స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న బాలల రక్షిత గృహాలు, హాస్టల్స్ నడుపుతున్న యాజమాన్యాలతో ఆయన సమావేశం నిర్వహించారు. హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూల్స్ లలో చదువుకుంటున్న విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందించాలని ఆదేశించారు. విద్యా శాఖ విద్యార్థులకు అక్షయపాత్ర నుండి ఆహారం వస్తుందని డిఈఓ కృష్ణ చైతన్య వివరించారు. స్టోరేజ్ చేసిన తాగు నీరు వినియోగించకూడదని చెప్పారు. ఆర్. ఒ. ప్లాంట్ ఉండేటట్టు చూడాలన్నారు. ఫ్రూట్, కూరగాయలు ఫ్రెస్ గా ఉండాలన్నారు. 500 దాటిన వారికి ప్రత్యేక అధికారి ఉండాలని చెప్పారు. 500 లోపల ఉన్న హాస్టళ్లకు కింద స్థాయి అధికారి ప్రత్యేక అధికారి ఉండాలన్నారు. సెక్యూరిటీ ఉండాలని చెప్పారు. డోనర్స్ ద్వారా ఆహారం సరఫరా చేస్తున్నది లేనిది ఆయన ఆరా తీశారు. బయటి నుంచి ఆహారం తీసుకోకూడదని చెప్పారు. కాలేజీ అటాచ్డ్ డ్ హాస్టల్ ఉంటేనే నడపాలని వెనకబడిన సంక్షేమ అధికారి అనూరాధ కలెక్టర్ కు

వివరించారు. మండలాలు జిల్లా కేంద్రాల్లో ఉన్న హాస్టళ్లను గుర్తించాలన్నారు. పిహెచ్ సి డాక్టర్ లకు ట్యాగ్ చేయాలని డిఎంహెచ్ఓను ఆదేశించారు. ఎక్స్పైరీ డేట్ చూసుకోవాలని చెప్పారు. ఆహారం కలుసితం కాకుండా చూడాలన్నారు. కిచెన్ వద్ద పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ వాటర్ ట్యాంక్ క్లీనింగ్ చేయాలని, బయటి నుంచి ఆహారం తీసుకోకూడదని చెప్పారు. మషాలాలకు రంగు వేస్తున్న నేపథ్యంలో బయటి ఆహారం తీసుకోకూడదని తెలిపారు. బయటి ఫుడ్ పొల్యూషన్ అవుతుందని వివరించారు. ఎక్స్పైరీ డేట్ అయిపోతే పారవేయాలని ఆహార భద్రతా అధికారి జి. శ్రీరాములు చెప్పారు. లిసహాయ భద్రత నియంత్రణాధికారి వెంకటరత్నం 9704009989 నంబర్ కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. అనంతరం హాస్టల్స్ నడుపుతున్న యాజమాన్యాలతో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతి శ్రీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాస్టళ్లలో మెనూ బయటి డిసిప్లే చేయాలన్నారు. బయటి నుండి ఫుడ్ తీసుకోకూడదని చెప్పారు. పాత హిస్టరీని పరిశీలించి సెక్యూరిని ఏర్పాటు చేయాలని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. సందర్శకుల రిజిష్టర్ ఉండాలని తెలిపారు. బిసి సంక్షేమ అధికారి అనూరాధ, సాంఘిక సంక్షేమ శాఖ డిడి, డిఎంహెచ్ఓ, రెసిడెన్షియల్ స్కూల్ కో ఆర్డినేటర్, తదితరులు పలు సూచనలు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి కృష్ణ చైతన్య, జిల్లా రెసిడెన్షియల్ స్కూల్స్ కో ఆర్డినేటర్ బాలాజీ నాయక్, ఆర్ఐఓ దుర్గారావు,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ శ్రీ లక్ష్మీ, ప్రొటెక్షన్ జిల్లా అధికారి రమణ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ శ్రీ లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

పేదల కడుపు కొట్టడానికే కూటమి ప్రభుత్వం సిద్ధం

- పలు కారణాలు చూపి వివిధ పెన్షన్లు తొలగింపు

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విశాలాంధ్ర-హిరమండలం: రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం పేద వృద్ధులు మహిళలు, వికలాంగులు తదితర పెన్షన్లను తొలగింపునకు సిద్ధమైంది. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఎటువంటి తారతమ్యాలు లేకుండా అర్హత ప్రామాణికంగా తీసుకుని ప్రతి ఒక్కరికి పెన్షన్ అందించిన తీరుకు చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం పూర్తి వ్యతిరేకంగా వ్యవహరించడం బాధాకరమని పాతపట్నం నియోజక వర్గమాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం అన్నారు. ఒకటో తారీకు రాగానే జగనన్నగ్రామ వాలంటీర్ల ద్వారా అర్హులైన ప్రతి ఒక్క పింఛను దారులకు ఇంటి వద్దకే అందజేసేవారని, అర్హత కలిగిన పింఛనుదారులపై వివక్ష చూపుతూ.. పెన్షన్‌దారులకు నోటీసులు ఇచ్చి పెన్షన్లు తొలగించే ప్రక్రియను కూటమి ప్రభుత్వం మొదలుపెట్టడం బాధాకరమని, అన్నారు. పెన్షన్ల పైనే ఆధారపడిన ఎంతో మంది పేదల ఉసురును పోసుకుంటే.. చంద్రబాబుకు మంచి జరగదని ఆమె ఎద్దేవా చేశారు. సూపర్‌సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను ఒకటి కూడా అమలు చేయక పోగా.. పేదల పెన్షన్లపై కూడా పిడుగువేసి.. వారికి జగనన్న పెద్ద కొడుకుగా ఇచ్చిన భరోసాను సైతం వెనక్కి లాక్కోవడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. ఇటువంటి అరాచకాలకు పాల్పడితే ప్రజలుచూస్తూ ఊరుకోరని తెలుసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు.

కెమెరా కన్ను చరిత్రకు సాక్ష్యం

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంలో వక్తలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: కెమెరా కన్ను చరిత్రకు సాక్ష్యమవుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫొటోగ్రాఫర్ల సంఘం సోమవారం సాయంత్రం నగరంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కె. చెన్నకేశవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్ప కళల్లో ఫొటోగ్రఫీ కూడా ఒకటని, ఫొటోగ్రఫీ వృత్తి ద్వారా అత్యున్నత స్థాయికి చేరుకున్నవారు ఎందరో ఉన్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని నేటితరం ముందుకు నడవాలన్నారు. మెలకువలను నేర్చుకుంటూ ముందుకు సాగితే ఫొటోగ్రఫీలో ఉజ్వల భవిత ఉంటుందని చెప్పారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్సింగ్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ఫొటోగ్రాఫర్ అవసరం ఉంటుందన్నారు. ప్రభుత్వాల పాలనలోనూ ఫొటోగ్రఫీ ప్రాముఖ్యత ఎంతో కనిపిస్తుందని పేర్కొన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ సిపాయిల తిరుగుబాటు, స్వాతంత్ర్య పోరాటం కొన్ని దశాబ్దాల క్రితం పరిపాలనా విధానం గురించి చరిత్రకు సాక్ష్యంగా ఫొటోగ్రఫీ నిలిచిందని తెలిపారు. ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.జోగినాయుడు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సహాయ సహకారాలు అవసరమన్నారు. ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా పూర్వ గవర్నర్ గేదెల ఇందిరా ప్రసాద్ పదివేల ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కెమెరాను కనుగొన్న లూయిస్ డాగురే 185వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేశారు. జిల్లాలో సీనియర్ ఫొటోగ్రాఫర్ పొడుగు గజపతిని అతిథులు సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ కార్యదర్శి దేవీప్రసాద్, సంఘ ప్రతినిధులు కొర్లాడ కొండబాబు, లోపింటి చిట్టిబాబు, కిల్లంశెట్టి శ్రీనివాస్, జిల్లాలోని పలువురు ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం

విశాలాంధ్ర-రణస్థలం: జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా గాలికుంటు వ్యాధి టీకాలను రణస్థలం మండలం, బంటుపల్లి గ్రామంలో మంగళవారం నియోజకవర్గ శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వర రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎయిడ్స్ రహిత సమాజం నిర్మిద్దాం

విశాలాంధ్ర-సోంపేట: ఎయిడ్స్ రహిత సమాజం ధ్యేయంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని, యువత ఎయిడ్స్ బారిన పడకుండా జాగ్రత్త పడాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ తరపున జిల్లా సూపర్‌వైజర్ పి.సుధాకర్ విద్యార్థులను కోరారు. మంగళవారం కొర్లాం బాలకృష్ణ జూనియర్ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎయిడ్స్ బారిన పడిన వారు కూడా సమాజంలో గౌరవంగా జీవించే హక్కు కలిగి ఉన్నారని అలాంటి వారిని చిన్నచూపు చూడకుండా అంటరానివారిగా భావించకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రాంబుడ్డి గణపతి, వైస్ ప్రిన్సిపాల్ ఈ.హరికృష్ణ, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ముందుకు వెళ్దాం

శ్రీకాకుళం దిశ ఎస్ఐ మొజ్జాడ ప్రకవల్లిక

సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి ఆధ్వర్యంలో ఉచితంగా వృక్షజాతి మొక్కల పంపిణీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: శ్రీకాకుళం నగరాన్ని సుందర నగరంగా మార్చేందుకు, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ముందుకు వెళ్దామని శ్రీకాకుళం దిశ ఎస్ఐ మొజ్జాడ. ప్రకవల్లిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరమంతా కాలుష్యంతో నిండిపోయిందని, శ్రీకాకుళాన్ని గ్రీన్ సిటీగా మార్చే బాధ్యతను మనమంతా తీసుకుందామని ప్రవల్లిక కోరారు. సిక్కోలు స్వచ్ఛంద సేవ సమితి వ్యవస్థాపకులు శిల్లా.రమేష్ ద్వారా ఢిల్లీకి చెందిన సంస్థ గూంజ్ వారి సహకారంతో సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి ఆధ్వర్యంలో 25 వేల ఉచిత వృక్షజాతి మొక్కల పంపిణీ కార్యక్రమం నేటి నుండి ప్రారంభమౌతాయని, సింగుపురం గ్రామ హైస్కూల్ గ్రౌండ్లో మొక్కలున్నాయని తెలిపారు. ఈ మహోత్తర కార్యక్రమానికి జిల్లాలో ఉండే అన్ని స్వచ్ఛంద సంస్థలు నడుంబిగించి ముందుకు రావాలన్నారు. సంస్థ సభ్యులు ఉర్లం.శివతేజ మాట్లాడుతూ కాలుష్యరహిత జిల్లాగా ఉంచడానికి మనమంతా భాగస్వాములమవుదామన్నారు. ఎవరికి ఎన్ని మొక్కలు కావాలన్నా ఇస్తామని, కావలసిన వారు ఆధార్ కార్డు నకిలీని జతచేయాల్సి ఉంటుందన్నారు. అలాగే మొక్కలు నాటేటప్పుడు చిత్రాలను బంధించాలని, మొక్కలు కావలసిన వారు వివరాలకు చరవాణి ద్వారా 7075666108/ 8106218184 / 9160966095 / 6309588342 సంప్రదించాలన్నారు.

దొంగల ముఠాని పట్టుకున్న పోలీసులు

85 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలో గడచిన కొద్దిరోజులుగా వరుస దొంగతనాలు చోటు చేసుకున్న విషయం అందరికీ తెలిసిందే. అయితే, ఈ మధ్యకాలంలో టెక్కలి, జలుమూరు, కాశిబుగ్గ, ఇచ్ఛాపురం, ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాని టెక్కలి పోలీసులు ఎంతో చాకచక్యంగా చేధించారు. ఈ దొంగతనాలు అంతరాష్ట్రం కి చెందిన నలుగురు వ్యక్తులు చేశారని టెక్కలి సిఐ పైడయ్య మంగళవారం మీడియాతో సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్కలిలో జూలై 31వ తేదీన అర్ధరాత్రి జరిగిన రోటరీ నగర్ వన్ వీధికి చెందిన కర్రి వేణుగోపాలరావు ఉపాధ్యాయుడు ఇంటిలో బంగారం, నగదు చోరీ జరిగిందని స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చిన సంగతి అందరికీ తెలిసిందే. ఆ దొంగతనాలకి పాల్పడిన వాళ్లు భువనేశ్వరం కి చెందిన ఇద్దరు దొంగలు, పశ్చిమ బెంగాల్ కి చెందిన ఇద్దరు దొంగలు మొత్తం నలుగురు దొంగలను సోమవారం పలాస ఎల్ సి గేటు అండర్ కన్స్ట్రక్షన్ బ్రిడ్జ్ వద్ద చాకచక్యంగా పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. వారిలో భువనేశ్వర్ కి చెందిన ఏ-1 ముద్దాయి సిభుదాస్ వద్ద నుండి ఒక బంగారు చంద్రహారం చైను, బంగారం చైన్, బంగారం ఉంగరం, బంగారం చెవి కి పెట్టుకునే వస్తువులు మొత్తం కలిపి 55.49 గ్రాములు బంగారం స్వాధీనం చేసుకోగా, ఏ-2 ముద్దాయి తరేమిరావు వద్ద నుండి బంగారం ఉంగరాలు 2, బంగారం బ్రాస్లెట్, బంగారం చెవి కి పెట్టుకునే వస్తువులు మొత్తం 13 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకోగా, మరో ఇద్దరు పశ్చిమ బెంగాల్ కి చెందిన ఏ-3 ముద్దాయి దిలీప్ రాయ్ వద్దనుండి బంగారం చైన్, చెవికి పెట్టుకునే వస్తువులు మొత్తం 9.గ్రాము లు స్వాధీనం చేసుకోగా, ఏ-4 ముద్దాయి దీపాంకర్ రాయ్ వద్ద నుండి బంగారం ఉంగరం, చెవి కి పెట్టుకునే వస్తువులు మొత్తం 7.51 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు. అయితే వీరి ఆరు దొంగతనాలు కేసులలో సుమారు రూ.6.29లక్షలు విలువచేసే 85 గ్రాముల బంగారు ఆభరణాలు మరియు రూ.7వేలు నగదు, 5 మొబైల్ ఫోన్లు వారి వద్ద నుండి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పైడయ్య తెలియజేశారు. వీరిపై సిఆర్ నంబర్. 322/2024 యు/ఎస్ 331(4), సిఆర్ నంబర్.279/2024 యు/ఎస్ 457, సిఆర్ నంబర్ 280/2024 యు/ఎస్ 457, సిఆర్ నంబర్.30/2024 యు/ఎస్ 457 కేసులపై రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు టెక్కలి ఎస్ఐ-2 వి వెంకటరమణ, ఏఎస్ఐ నర్సింగరావు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కాలువల్లో పూడికలు తొలగింపు పనులు

పరిశీలించిన ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నుంచి శ్రీకాకుళం నియోజకవర్గంలో రైతన్నలకు ఏ కష్టం వచ్చినా వారికి చేదోడువాదోడుగా నిలుస్తూ వారికి అన్నివిధాలా అండగా నిలుస్తున్నారు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్. కుడి ప్రధాన కాలువకు ఆనుకొని ఉన్న పల్లివలస వద్ద పిల్లకాలువ పూర్తిగా పూడికలతో నిండిపోయింది. దీంతో రైతులు సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే శంకర్‌కు కోరడంతో ఆయన ఆదేశాల మేరకు మంగళవారం పల్లివలస డంపింగ్ యార్డు సమీపంలోని కుడి ప్రధాన కాలువ 29ఎల్ డిస్ట్రిబ్యూటరీ జంగిల్ క్లియరెన్స్, సిల్ట్ తొలగింపు పనులు ప్రారంభించారు. దీని వలన సింగుపురం గ్రామ పరిమితికి నీటి సరఫరా అందుతుందని తెలిపారు. ఈ పనులను మంగళవారం ఎమ్మెల్యే గొండు శంకర్ పర్యవేక్షించి అధికారులకు, స్థానిక నాయకులు పలు సూచనలు చేశారు. అదేవిధంగా కుడి ప్రధానకాలువ 27ఎఆర్ డిస్ట్రిబ్యూటరీలో కూడా జంగిల్ క్లియరెన్స్, సిల్ట్ తొలగింపులను ప్రారంభించారు. ఈ పిల్లకాలువల ద్వారా రూరల్ మండల పరిధిలోని ఐదు గ్రామాలు లంకం, లింగాలవలన, గూడెం, చంద్రయ్యపేట, పాత్రునివలసలకు సుమారు వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. గత ప్రభుత్వానికి రూరల్ మండలానికి చెందిన పలు గ్రామాల రైతులు ఎంత మొత్తుకున్నా కాలువల్లో పూడికతీత పనులు చేయక పోవడంతో సాగు నీరందక రైతులు తీవ్ర ఇబ్బం దులు పద్దారని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధాన కాలువలతో పాటు పిల్లకాలువల్లోని పూడికలు తొలగించి రైతుల మోముల్లో ఆనందం నింపామన్నారు. రైతుల కష్టాలు తెలిసిన సీఎం చంద్రబాబునాయుడు రైతులకు ఎప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. శ్రీకాకుళం రూరల్, గార మండలాల్లో ఇప్పటికే పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి వేలాది ఎకరాలకు సాగునీరు అందించామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు.

ఫార్మాసిస్ట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా 'సంతోష్'

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం: స్థానికంగా ఓం శుభమ్ మెడికల్ ప్లాజా నిర్వహిస్తున్న సంతోష్‌కుమార్ సాహుకు రాష్ట్ర స్థాయి పదవి వరించింది. రాష్ట్ర ఫార్మసిస్ట్స్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులుగా సంతోష్ కుమార్ సాహు పేరును ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు మద్దెల సురేష్‌బాబు ప్రకటించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ పి.సి.ఐ ఎలక్షన్స్ జరగక 13వేల పై చిలుకు రెన్యూవల్స్ ఆగిపోయాయని అన్నారు. మెడికల్ స్టోర్స్ పెట్టుకునే ఫార్మసిస్ట్‌లకు సబ్సిడీతో కూడిన ఋణాలు మంజూరుకు, డి-ఫార్మసి చేసిన వారిని క్లినికల్ ఫార్మసిస్టులుగా గుర్తించిన ప్రభుత్వం వారిని పి.హెచ్.సిలు, సి.హెచ్.సిల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేస్తానని సంతోష్ అన్నారు. మ్యాన్‌ఫ్యాక్చరింగ్ డ్రగ్ స్టోర్స్‌ల్లో 80% ఫార్మసిస్ట్‌లు ఉండేలా పోరాటం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తనకు రాష్ట్ర స్థాయి సంక్షేమ సంఘంలో అవకాశం కల్పించిన అధ్యక్షునితో పాటు ఇతర కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఫార్మసీ యాక్ట్ 1948 సెక్షన్ 42 ప్రకారం ప్రతి మెడికల్ స్టోర్‌లో తప్పనిసరిగా ఫార్మసిస్ట్ ఉండాల్సినప్పటికీ నిబంధనలు అమలు కాక అనర్హులైన వారు మెడికల్ షాపుల ద్వారా డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండ షెడ్యూల్డ్ డగ్స్ విచ్చలవిడిగా ఇవ్వడాన్ని ఖండించారు.

శ్రీరాంపురాన్ని రెవెన్యూ విలేజ్‌గా మార్చండి

ఎమ్మెల్యే డా.బెందాళం అశోక్‌తో కలిసి మాజీ సర్పంచ్ రామారావు కలెక్టర్‌కు వినతి

విశాలాంధ్ర-సోంపేట/ కంచిలి: కంచిలి మండలం పెద్ద శ్రీరాంపురం పంచాయతీ ని రెవెన్యూ విలేజ్‌గా మార్చా లని కోరుతూ ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్‌తో కలిసి శ్రీరాంపురం మాజీ సర్పంచ్ మాదిన రామారావు మంగళవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. జనాభా పరంగాను, వైశాల్యం రీత్యా పెద్దశ్రీరాంపురం చాలా పెద్ద గ్రామమని పేర్కొన్నారు. అలాగే కంచిలి మండలం తలతంపర పంచాయతీ లొండపుట్టుగ గ్రామంలో గత ఏడాది మే నెలలో పిడుగుపాటుతో మృతిచెందిన లొండ ప్రశాంత్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు రామారావు తెలిపారు.

అంబేద్కర్ వర్సిటీలోని హాస్టళ్లను తనిఖీచేసిన వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలోని హాస్టల్స్‌లో బయట నుంచి ఆహార పదార్థాలను అనుమతించవద్దని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అధికారులకు సూచించారు. ఆమె వర్సిటీలోని హాస్టల్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి భోజనం చేశారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వాటర్ ట్యాం కులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాల న్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, డిప్యూటీ వార్డెన్లు ఎం.చిన సుబ్బారావు, బి. వేణు తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సర్వ సాధారణం...

- ప్రజా సమస్యల పరిష్కారం లో ప్రభుత్వం విఫలం

- బాధ్యతగల ప్రతిపక్షంగా ప్రజా గొంతుకగా నిలుద్దాం

- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర-ఆమదాలవలస: బాధ్యతగల ప్రతిపక్షంగా, ప్రజల గొంతుకుగా ప్రజాపక్షంగా నిలుద్దామంటూ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం వైసిపి క్యా డర్ కు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం ఆమదాలవలస నియోజకవర్గం బూర్జ డొంకల పర్త లోని ఎస్ వి ఎస్ కల్యాణ మండపంలో మండల వైసీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ దేశంలో ఏ ఒక్క ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్ర ప్రజలకు మేలు చేసినప్పటికీ వైసిపి అధికారం కోల్పోవడం బాధాకరమైన విషయం అన్నారు. గత రెండు నెలలుగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు మేలైన పాలన అందించలేకపోవటం ప్రజల్లో ఒక రకమైన అసహనం ప్రారంభమైందన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు లోను ప్రస్తుత ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇదే సమయం లో బాధ్యతగల ప్రతిపక్షంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కోరారు. తమ ప్రభుత్వ హయాం లో ఉన్నత స్థాయి ప్రభుత్వ సంస్థలు, ప్రాజెక్టులు వంటివి మంజూరు చేయించుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికే వాటి కి సంబంధించి ఆర్థికపరమైన ఆమోదం పొందడం జరిగిందన్నారు. వీటి అభివృద్ధికి అవసరమయ్యే నిధులు తక్షణం మంజూరు జరిగేలా స్థానిక శాసనసభ్యులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే ఎన్నికలకు పార్టీ క్యాడర్ ఇప్పటి నుండి సమాయత్తం కావాలని తమ్మినేని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ వైసీపీ క్యాడర్కు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపీపీ కర్నెన దీప, జడ్పీటిసి బెజ్జీపురపు రామారావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనా యుడు, మాజీ డిసిసిబి డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు బగాది నారాయణమూర్తి, బుర్జ మండల సర్పంచులు, ఎంపీ టీసీలు, నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

స్కూల్ స్వీపర్లకు జీతాలు చెల్లించాలి

విశాలాంధ్ర-పలాస: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లకు వేతన బకాయిలు చెల్లించాలని యూనియన్ నాయకులు ఎన్. గణపతి, స్వీపర్ల ప్రతినిధులు పి. సుశీల, బి.స్వాతి డిమాండ్ చేశారు. మంగళవారం పలాస మండల విద్యాశాఖ కార్యక్రమం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఎంఈఓ సిహెచ్ శ్రీనివాసరావుకు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పాఠశాలల అభివృద్ధి లో స్కూళ్లలో శానిటేషన్ వర్కర్స్ ని నియమించారని, వారికి గత నాలుగు నెలలుగా జీతాలందక నానా అవస్థలు పడుతున్నారన్నారు. అందులో పనిచేసే అందరూ దళిత, గిరిజన, అణగారిన వర్గానికి చెందిన వారని, నెలంతా చాకిరీ చేస్తే నెలకు జీతం ఇవ్వకపోతే కుటుంబం ఎలా గడుస్తుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తక్షణమే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆదమ్మ, నరసమ్మ, బి ఉమా, బిశకుంతల పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-రణస్థలం: ఆగస్టు 21 బుధవారం నాడు భారత్ బంద్ సందర్భంగా ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసన తెలియజేస్తూ బుధవారం ఉదయం 10 గంటలకు రణస్థలం మండల కేంద్రంలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్నందున మండలంలో గల దళిత ప్రజలు, ప్రజా సంఘాలు, యువత, యువకులు పెద్దఎత్తున పాల్గొని బంద్‌ను జయప్రదం చేయాల్సిందిగా డి.రామ్ మాస్టర్, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, ఆర్గనైజింగ్ సెక్రటరీ, శ్రీకాకుళం జిల్లా కోరారు.

ప్రముఖ సాహితీవేత్త ఆచార్య ముత్యం మృతి తీరనిలోటు

విశాలాంధ్ర-పొందూరు: ప్రముఖ సాహితీవేత్త, దార్శనికుడు ఆచార్య కె.ముత్యం మృతి తెలుగు సాహిత్యానికి తీరని లోటని విశ్రాంత తెలుగు రీడర్ డా.అల్లంశెట్టి చంద్రశేఖరరావు, నామ విజ్ఞాన వేత్త వాండ్రంగి కొండలరావు నివాళులర్పించారు. మంగళవారం ఈ మేరకు ఓ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, కవి గరిమెళ్ళ సత్యన్నారాయణ, విప్లవ కవి పాణిగ్రాహి సుబ్బారావు తదితర ప్రముఖుల సాహిత్యంపై విశిష్ట పరిశోధనలు చేసిన మహానుభావుడని కీర్తించారు. మరో స్వాతంత్ర్య యోధుడు పుల్లెల శ్యామసుందరావు జీవిత చరిత్రను సమగ్రంగా చిత్రీకరించారని పేర్కొన్నారు. శ్రీకాకుళం గిరిజనోద్యమంపై ఎన్నో రచనలు చేసి చైతన్యం కలిగించారని అన్నారు. ఆయన తెలంగాణాకు చెందిన రచయిత అయినప్పటికీ శ్రీకాకుళం జిల్లాపై ఎనలేని అభిమానాన్ని కనబరిచారని అన్నారు. జిల్లాలో జరిగిన అనేక సాహిత్య సభల్లో పాల్గొనడం విశేషమని చంద్రశేఖరరావు, కొండలరావు వ్యాఖ్యానించారు.

ఘనంగా పాతూరి జయంతి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి శాఖా గ్రంథాలయములో మంగళవారం కళా ప్రపూర్ణ పాతూరి నాగభూషణం 117వ జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె.రామక్రిష్ణ పాతూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ గ్రంథాల యోద్యమానికి స్థిరమైన రూపురేఖలు దిద్దిన కళా ప్రపూర్ణ పాతూరి నాగభూషణం అని, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ రథసారథిగా ఉండి, ఆంధ్రప్రదేశ్‌లో గ్రంథా యోద్యమాన్ని బహుముకాలుగా విస్తరింప చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు బాబురావు, రీడర్స్ ఉమామహేష్, నారాయణ, లోకేష్ ఎంపీపీ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పలువురుకి మాజీమంత్రి గుండ పరామర్శ

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం నియోజకవర్గం నగర కార్పొరేషన్ పరిధిలో అరసవిల్లి బ్రాహ్మణ వీధిలో బంకుపల్లి శంకర శాస్త్రి ఇటివల మరణించారని తెలుసుకొని వారి కుటుంబాన్ని మాజీమంత్రి గుండ అప్పల సూర్యనారాయణ మంగళవారం పరామర్శించారు. అనంతరం కిమ్స్ హాస్పిటల్లో అల్లు రామూర్తి కి యాక్సిడెంట్ అయిందని తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎచెర్ల మండలం బొంతలకోడూరు గ్రామంలో బెహరా మోహన్ రావు ఇటీవల మరణించారని తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతోపాటు మాజీ కౌన్సిలర్ గంగు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్చడమైనది

K. అప్పలనాయుడు S/o. లేటు సుగ్రీవులు, బలద గ్రామ కాపురస్తులు. K. అప్పలనాయుడు పేరు మీదన కొత్తూరు మండలం, బలద గ్రామం, పోస్టు, నివగాం బ్రాంచ్ పోస్టాఫీసులో RAPVPEA 311380 పాలసీ కలదు. కోడూరు మాధవరావు S/o. లేటు సుగ్రీవులుగా పేరు మార్చడమైనది. ఇక నుంచి బ్యాంకు లావాదేవీలు, పోస్టల్, ఇతరత్రా ఆస్థి వ్యవహారాలు ఈ పేరున వినియోగించుకుంటున్నామని పత్రికా ముఖంగా తెలియజేస్తున్నాం.

ఇట్లు
కోడూరు మాధవరావు, S/o. లేటు సుగ్రీవులు
బలద గ్రామం, పోస్టు, కొత్తూరు మండలం,
శ్రీకాకుళం - 532 457

సెప్టెంబర్ 14న లోక్ అదాలత్

విశాలాంధ్ర - పలాస : పలాస సివిల్ కోర్టులో సెప్టెంబర్ 14న లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పలాస సివిల్ ఇన్చార్జి జడ్జి బిఎంఆర్ ప్రసన్న లత తెలిపారు. మంగళవారం పలాస సివిల్ కోర్టులో న్యాయ వాదులు, పోలీస్ అధికారులతో లోక్అదాలత్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారులు కేసులు నుండి శాశ్వతం గా విముక్తి పొందడానికి లోక్ అదాలత్ లు చక్కని వేదిక అని, ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒకసారి లోక్ అదాలత్ లో కేసులు పరిష్కారం అయితే భవిష్యత్తులో ఏ కోర్టులో అదే కేసు పై కేసు నమోదు చేయడం జరగ దన్నారు. లోక్ అదాలత్ పై ప్రజలకు, కక్షి దారులకు అవగాహన కల్పించాలని కోరారు. సమా వేశంలో సూప రింటెండెంట్ కృష్ణ, న్యాయ వాదులు, పోలీసులు పాల్గొన్నారు.

దేశానికి గొప్ప సంపద రాజీవ్ గాంధీ

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : భారతదేశాన్ని 21వ శతాబ్దంలోకి నడిపించిన నవ నాయకుడు రాజీవ్ గాంధీ కాంగ్రెస్ పార్టీకే కాక దేశానికి ఒక గొప్ప సంపదగా మిగిలిపోయారని శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వర రావు అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా శ్రీకాకుళం డిసిసి కార్యాలయం ఇందిరా విజ్ఞాన్ భవన్లో జరిగిన కార్యక్రమంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశాన్ని సాంకేతిక యుగంలోకి నడిపించడమే కాకుండా దేశ సమగ్రత అభివృద్ధి సమైక్యతకు కట్టుబడిన నాయకుడని, అతి చిన్న వయసులో క్లిష్ట పరిస్థితుల్లో ప్రధాని పదవిని చేపట్టి విజయవంతంగా ప్రపంచంలో గుర్తింపు పొందిన మహా నేతని ఆయన కొనియాడారు. భారతదేశ నిర్మాణంలో జవహర్లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, వ్యవసాయ పారిశ్రామిక రంగాల్లో దేశాన్ని పరుగులు పెట్టించగా, రాజీవ్ గాంధీ సాంకేతిక విప్లవానికి నాంది పలికారని పేడాడ స్పష్టం చేశారు. దేశం ఐకమత్యంతో ఎంతవరకు ఉంటుందో అంతవరకే భారత అభివృద్ధి సాధ్యమని, కులమత ప్రాంతీయవిభేదాలకు అతీతంగా దేశం ఐకమత్యంగా సాగడాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలని రాజీవ్ గాంధీ కలలు కన్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం మతవిద్వేషాలకు ఆజ్యం పోస్తూ, చాందసత్వాన్ని పెంపొందిస్తూ రాజీవ్ గాంధీ విధానాలకే కాక దేశ సమగ్రతకు తూట్లు పొడుస్తుందని పరమేశ్వర విమర్శించారు. శ్రీకాకుళం బెహరా మానసిక వికలాంగుల కేంద్రం విద్యార్థులకు రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం పట్టణ పార్టీ అధ్యక్షుడు డి. గోవిందమల్లిబాబు, ఆమదాలవలస అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ పిసిసి ప్రధాన కార్యదర్శి ససపల అన్నాజీ రావు, ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ మాసుపత్రి చక్రవర్తిరెడ్డి, నరసన్నపేట ఇంచార్జ్ మంత్రి నరసింహమూర్తి, పిసిసి అధికార ప్రతినిధి చింతాడ దిలీప్, జిల్లా కిసాన్ సెల్ల అధ్యక్షులు కోత మధుసూదన్ రావు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కే వి ఎల్ ఎస్ ఈశ్వరి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేష్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కొత్తూరు శైలజ, డాక్టర్ కవిటి గోపాలకృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దాట్ల లింగమూర్తి, జీ. అప్పారావు, పప్పు జగ్గారావు, రణస్థలం కాంగ్రెస్ నాయకులు ఆబోతుల వెంకట్ నాయుడు, ఐ.రమణ, ఎం సత్యనారాయణ, కోత శంకర్ ప్రసాద్, సంపత్ రావు సత్యనారాయణ, పేడాడ సూర్యనారాయణ, దీర్ఘాసి వెంకట్రావు, మామిడి సత్యనారాయణ, జిపి. నాయుడు, పలాస కాంగ్రెస్ పార్టీ నాయకులుబద్రి సీతమ్మ యాదవ్, బీసీ సంఘ నాయకులు బేనా ఢిల్లీ రావు, అమీరుల్లా బేగ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - పలాస : సీజన్ వ్యాదుల పై అప్రమత్తంగా ఉండాలని వార్డు కౌన్సిలర్ ప్రతినిధి డొక్కరి శంకర్ అన్నారు. మంగళవారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ 30 వార్డు పరిధిలోని ఉదయపురం గ్రామంలో పలాస క్యాజుల్యాండ్ వనిత, శ్రీకాకుళం రాగోలు జేమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలాస క్యాజ్ ల్యాండ్ వనిత అధ్యక్షురాలు తర్లాన శ్వేత కుమారి, కార్యదర్శి మల్ల సంతోషి, కోశాధికారి తూముల గాయత్రి, పూర్వ అధ్యక్షురాలు మల్లా జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కోల్కత్తా ఘటనకు నిరసనగా ర్యాలీ

విశాలాంధ్ర - సంతబొమ్మాలి : కోల్కతాలో ఇటీవల జరిగిన ట్రైనీ వైద్యురాలి సంఘ టనకు వ్యతిరేకంగా సంతబొమ్మాలి మండలం వెల్లేవలస పంచాయతీలో జనసేన నాయకుడు ఏదూరు చిరంజీవిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఇటువంటి సంఘటనలు భవిష్యత్ లో పునరావృతం కాకుండా ఉండాలని నినాదాలు చేశారు. వెల్లేవలస ప్రభుత్వ పాఠశాల నుంచి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించినట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ఐ .అప్పన్న,ఉపాధ్యాయులు పాల్గోన్నారు.

క్రీడాకారులకు క్రికెట్ కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - సోంపేట/కంచిలి : కంచిలి మండలం బూరగాం గ్రామంలో గల క్రీడాకారులకు ఆబోతు ఢిల్లీరావు 3వేల రూపాయల విలువైన క్రికెట్ కిట్‌ను మంగళవారం అందజేశారు. గణిత అష్టావధాని మద్దు తిరుపతిరావు చేతుల మీదుగా క్రికెట్ కిట్ అందజేస్తూ క్రీడాకారులు ఢిల్లీరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత శిక్షణకు ప్రవేశాలు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సులలో ఉచిత శిక్షణను ఈ నెల 31వ తేదీన ప్రారంభిస్తున్నట్లు శిక్షణా సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణలో చేరేందుకు 19-45 ఏళ్ల లోపు మహిళలు అర్హులని చెప్పారు. శిక్షణా కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల మహిళలు నేరుగా శిక్షణా కేంద్రాన్ని సంప్రదిం చాలన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ నెంబర్లు 9553410809, 7993340407కు సంప్రదించాలన్నారు.

పలాసపురంలో విద్యార్థులకు కంటి పరీక్షలు

విశాలాంధ్ర - సోంపేట : ఈ మండలం పలాసపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం వైద్యనిపుణుడు లక్ష్మణరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు కంటి చుక్కల మందు అందజేశారు. కొందరకు కళ్లద్దాలను సిఫార్సు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం హరికృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చరిత్ర పరిశోధకులు డాక్టర్ కె.ముత్యం మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

విశాలాంధ్ర - పలాస : చరిత్ర పరిశోధకులు డాక్టర్ కె. ముత్యం మృతి చెందడం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు మధ్యలో రామారావు, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిరి దానేష్ లు అన్నారు. మంగళవారం ఆయన మృతికి తీవ్ర సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంస్కృతిక రంగంలో చరిత్ర అధ్యాపకుడిగా ఆయన ఎన్నో రచనలు చేశారని, ఉత్తర తెలంగాణ, నిజామాబాదులో 1952లో జన్మించారని, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎమ్మెస్సీ తెలుగు విద్యార్థిగా ఉన్నప్పుడు పిడిఎస్ యు విప్లవ విద్యార్థి సంఘానికి అధ్యక్షుడుగా ఎన్నికైన దగ్గర నుండి ఆయన మృతి చెందే వరకు పీడిత ,తాడిత ప్రజానీకం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని గుర్తు చేశారు. బెనారస్ విశ్వవిద్యాలయంలో శ్రీకాకుళ సాహిత్యం మీద పిహెచ్ డి చేశారన్నారు. అది మొదలు శ్రీకాకుళ ఉద్యమం పైన ఉత్తరాంధ్ర పైన 40 ఏళ్లుగా ఆయన నిరంతరం అధ్యయనం చేస్తూ మట్టి పొరలు కింద కప్పబడ్డ చరిత్రను పరిశోధిస్తూ వాటి శకలాలను తవ్వితీస్తూ పుల్లెల శ్యాంసుందర్, గరీమెళ్ళ సత్యనారాయణ ,మార్పు పద్మనాభం ,గంటు రాజేశ్వరరావు, గానుగుల తరుణాచారి, విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి జీవిత చరిత్రలు,కామ్రేడ్ గంటి రాజేశ్వరరావు, వీర గున్నమ్మ చరిత్ర ,సునాముది జీవధార, ప్రవహిస్తున్న జ్ఞాపకం, అనేక రచన చేశారన్నారు. బంకుపల్లి మల్లయ్య శాస్త్రి చల్లా రాజులు దళిత కవి 12 పుస్తకాలు శ్రీకాకుళం ఉమ్మడి జిల్లా ఉత్తరాంధ్రపైన ఆయన పరిశోధనలకు నిదర్శనంగా నిలబడ్డాయని, ప్రజల పక్షపాతిగా పీడిత ప్రజల పక్షాన ఆయన నిరంతరం స్పందించేవారని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా అనేక ప్రజా ఉద్యమాల్ని, నాటి చరిత్రను వెలుగులోకి తీసు కొచ్చారని, కామ్రేడ్ ముత్యం మరణం బాధాకరం ఆయనకు విప్లవ జోహార్లను అర్పిస్తున్నామన్నారు. సంతాపం తెలిపిన వారిలో వంకల మాధవరావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు,తెప్పల డిల్లీ రావు, వైకుంఠ రావు, జుత్తు వీరిస్వామి,పి.నాగేశ్వరరావు ,వంకల అప్పయ్య తదితరులు ఉన్నారు.

వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటనను నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర - రణస్థలం : మండలంలో కోల్ కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై చోటు చేసుకున్న అమానవీయ ఘటనను ప్రతి ఒక్కరం ఖండించాలి. ఈ పాశవిక అత్యాచార, హత్య ఘటనను నిరసిస్తూ ఎచ్చెర్ల నియోజకవర్గ లిజనసేన ఇంచార్జ్ డా విష్వక్సేన్ ఆధ్వర్యంలో రణస్థలం జంక్షన్ లో కొవ్వొత్తుల ప్రదర్శన ద్వారా పెద్ద ఎత్తున నిరసన చేయటం జరిగింది.అత్యాచారంతో హత్య గురైన డాక్టర్ కు న్యాయం జరగాలని, మరే ఆడబిడ్డకు అన్యాయం జరగకుండా ప్రజలు గొంతు వినిపించాలని పిలుపునిచ్చారు.రాష్ట్రంలో మహిళలపై ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గ శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ పశ్చిమబెంగాల్ కాంగ్రెస్ ప్రభుత్వం ద్రోహులను వెంటనే శిక్షించాలని మీడియా తో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ముప్పిడి సురేష్, పిసిని జగన్నాథం నాయుడు, ఆనందరావు, దెయ్యం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా పాతూరి నాగభూషణం 117వ జయంతి

విశాలాంధ్ర - టెక్కలి : మండల కేంద్రంలో ఉన్న శాఖ గ్రంథాలయంలో పాతూరి నాగభూషణం 117వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ముందుగా గ్రంథా లయ అధికారి బి రూపావతి పాతూరి నాగ భూషణం చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయోద్యమనకి స్థిరమైన రూపురేఖలు దిద్దిన కళ పరిపూర్ణ పాతూరి నాగభూషణం 1907 ఆగస్టు 20న గుంటూరు జిల్లా తెనాలి తాలూకా పెద్ద పాలెం లో జన్మించారని తెలిపారు. అనంతరం ఆయన గురించి మాట్లాడుతూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - టెక్కలి : ఇటీవలే నర్సింగపల్లి గ్రామానికి చెందిన ఉర్జాన గణపతిరావు కి రోడ్డు ప్రమాదం జరిగి గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న నర్సింగపల్లి సేవా సంఘం, గ్రామం తరపున మంగళవారం వైద్య ఖర్చులు నిమిత్తం 34,600లు రూపాయలు వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నిర్వాహకులు ఎన్ని షణ్ముఖరావు, పెద్దరట్టి మణి, తోట ఆనందరావు, రట్టి సప్తగిరి, పతివాడ రవి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గొర్లె సూర్యని అభిందించిన 'కలిశెట్టి'

విశాలాంధ్ర - రణస్థలం : మండల కేంద్రంలో జనసేన యువ నాయకులు గొర్ల సూర్య నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ ఉచిత అన్నదాన కార్యక్రమం లో విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ రోజుకు 237వ రోజుకు ఉచిత అన్నదాన కార్యక్రమం చేరుకుంది. ఈ సందర్భంగా ఎంపీ అప్పలనాయుడు, గొర్ల సూర్య ని దుశ్శాలువతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ ఇలాంటి మహొత్రమైన కార్యక్రమం చేపట్టిన సూర్య కి ప్రత్యేక అభినందనలు తెలిపి, భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలని మరియు పేదలు, కూలీలు, ఇతరుల ఆకలి తీర్చడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ టీడీపీ అధినేత ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ ని ఆదర్శంగా తీసుకొని ఈ ఉచిత భోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి బానోజి నాయుడు, చిరంజీవి తదితరుల ఉన్నారు.

మానవ మృగాలను తక్షణమే ఉరి తీయాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు భాస్కరరావు, సర్పంచ్ ప్రతినిధి దేవరాజ్ సాహు

విశాలాంధ్ర - కవిటి : కలకత్తాలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యరాలపై అత్యంత కిరాతకంగా అత్యాచారం చేసి చంపిన మానవ మృగాలను తక్షణమే ఉరితీయాలని మాణిక్యపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు భాస్కరరావు, స్థానిక సర్పంచ్ ప్రతినిధి దేవరాజ్ సాహు కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు మాణిక్యపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు భాస్కర్ తో పాటు వైద్య సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి మానవహారం చేపట్టి తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిబ్బంది, వైద్య సిబ్బంది తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ కలకత్తా నగరంలో ఓ వైద్య విద్యార్థిని పై జరిగిన భయంకరమైన సంఘటన యావత్తు ప్రపంచము తలదించుకునేలా సంఘటన జరిగిందని అన్నారు. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం స్పందించి వారం రోజుల్లో సంబంధిత మానవ మృగాలను బహిరంగంగా ఉరితీయాలని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు బృందావన్ దొలాయి, జయసేన్ బిసాయి, రత్నాకర్ బిసాయి, దేవరాజు, హరికృష్ణ సాహూ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి

విశాలాంధ్ర - మందస : పాడి పశువులలో గాలికుంటు వ్యాధి అత్యంత ప్రమాదకరమని, పాడి రైతులు ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారులు దువ్వాడ శ్రీకాంత్, కిల్లి ఉమా భారతిలు అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 20 నుండి సెప్టెంబర్ 18 వరకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చేపడుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పనిసరిగా తమ పశువులకు వేయించుకోవాలని సూచించారు. ఈ వ్యాధి వైరస్ వల్ల సోకుతుందని, ఇది అంటువ్యాధి అని ఒక పశువు నుండి మరో పశువుకు కలుషిత నీరు, మేత వలన సోకుతుందని తెలిపారు. వ్యాధి బారిన పడిన పశువు తీవ్ర జ్వరంతో బాధపడుటుంటుందని, నోటిలో మరియు కాళ్ళ గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయన్నారు. నోటి నుండి తీగలు మాదిరిగా చొంగ కారుతూ తిండి మాని నీరసిస్తాయన్నారు. వ్యాధి బారిన పడిన పశువులలో పాల దిగుబడి తగ్గడం, చూడి పశువులు ఈసుకుపోవడం, పని సామర్థ్యం తగ్గడం వంటి సమస్యలు వస్తాయన్నారు. వ్యాధి సోకిన తరువాత వైద్యం ఆలస్యం చేస్తే పశువులు చనిపోయి రైతుకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుందని తెలిపారు. మండలంలో గల అన్ని గ్రామాలలో ఈ వ్యాధి రాకుండా నివారణ టీకాలను ఉచితంగా వేస్తున్నామని కనుక పాడి రైతులు ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉంటూ, పశుసంవర్ధకశాఖ సిబ్బంది ద్వారా వేస్తున్న టీకాలను వినియోగించుకోవాలని సూచించారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

విశాలాంధ్ర - పలాస : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ప్రధానోపాధ్యాయులు ఎస్‌వి రమణ రావు అన్నారు. మంగళవారం మండలం బ్రాహ్మణతర్లా హైస్కూల్ ప్లస్ (బాలికల జూనియర్ కళాశాల) లో ద్వితీయ ఏడాది ఇంటర్ విద్యార్థినిలు, మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వక్తలు ప్రసంగిస్తూ.. నూతనం గా గ్రామీణ ప్రాంతం లో ఏర్పడిన ఈ బాలికల జూనియర్ కళాశాలను అందరూ వినియోగించుకొని బాలిక విద్యకు ప్రోత్సహించి మహిళా సాధికార దిశగా దూసుకు పోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్వీ. రమణా రావు ఆధ్వర్యంలో జరగగా, పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షులు ఆర్. బాల శంకరం, సభ్యులు ఏ. కృష్ణారావు, జి.అప్పారావు, సీనియర్ ఉపాధ్యాయులు అప్పన్న ఈశ్వరరావు పాల్గొన్నారు.

పెళ్లి కోసం రూ.10 వేలు ఆర్థికసాయం

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : పేద ఇంటి అమ్మాయి పెళ్లి కోసం తమ వంతుగా ఉద్దానం అభ్యుదయ సేవా సమితి సభ్యులు రూ.పది వేలు ఆర్థిక సాయం అందించారు. మంగళవారం పూండిలోని పెళ్లి కుమార్తె పుట్ట గౌతమిని కలిసి నగదు మొత్తాన్ని ఆమెకు అందించారు. గౌతమి తండ్రి చిన్నప్పుడే చనిపోయారు. తల్లి లక్ష్మి కష్టపడి పెంచింది.నిరుపేద కుటుంబం రెక్క ఆడితే గాని డొక్కాడని బతుకు. అమ్మాయికి పెళ్లి కుదిరింది.పెళ్లి కొడుకు కట్న కానుకలు ఆశించకుండా పెళ్లికి ముందుకొచ్చాడు.కనీస ఖర్చులకు కూడా డబ్బు లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని సేవా సమితి సభ్యులు ముందుకొచ్చి తమ సహకారం అందించారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే తమ సంస్థ లక్ష్యమని ఉద్దానం అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు తామాడ లక్ష్మణ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు సీహెచ్ పాపారావు, మండల నీలయ్య, గణేష్, చింత శ్రీను, పవన్ కుమార్, గొండి రవి, దండుపాటి పవన్ కుమార్, బమ్మిడి నవీన్, గుంటు భాస్కరరావు, కొంకి మోహిని, బొడ్డు రజిని తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధుల నివారణకు దోమవ్యాప్తిని అరికట్టాలి

- దోమలు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి - డీఎంహెచ్ఓ డాక్టర్. బి మీనాక్షి

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా దోమల వ్యాప్తిని అరికట్టాలని అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి మీనాక్షి అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ బి.మీనాక్షి జండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ 7 రోడ్ల కూడలి వరకు కొనసాగింది అనంతరం కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి మాట్లాడితూ జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలను అనుసరించి దోమల నివారణకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే దోమ రహిత గ్రామం, జిల్లా, రాష్ట్రం, దేశం గా తీర్చిదిద్దేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. 1897 ఆగస్టు 20న దోమల నివారణ దినోత్సవంగా ప్రకటించారన్నారు. దోమల నుంచి మలేరియా వ్యాపిస్తోందని సర్ రోనాల్డ్ రాస్ కనుగొనడంతో అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. అలాగే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల నివారణకు ఎక్కువ అవకాశం ఉందన్నారు. ఈ సంవత్సరం నేటికీ 30 మలేరియా కేసులు గుర్తించడం జరిగిందని గతసంవత్సరం కన్నా ఈ సంవత్సరం మలేరియా కేసులు పెరగడానికి ప్రధాన కారణం ప్రక్క జిల్లాల నుంచి వ్యాప్తి చెందడమే అన్నారు. దోమలు కుట్టడం వల్ల అనేక వ్యాధులు ప్రబలు తున్నాయి. వ్యాధులు ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. మలేరియా, ఫైలేరియా, డెంగీ వంటి ఎన్నో వ్యాధులకు దోమలే కారణమన్నారు. రసాయనాలతో కూడిన అనేక రకాల లిక్విడ్‌లు, క్వాయిల్స్ వంటివి మార్కెట్లో లభిస్తున్నాయి. వీటిని ఉపయోగించడం వల్ల అనేక రకలైన శ్వాసకోస వ్యాధులు ప్రబలే ప్రమాదం లేకపోలేదు. ముందుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమల నివారణకు వైద్య శాఖ ద్వారా పలు అనేక చర్యలు చెపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా మలేరియా అధికారి పి.వి.సత్యనారాయణ, ఎ.ఎం.ఓ, ఎస్.శ్రీనివాస్, డి.సి శ్రీకాంత్, హెల్త్ ఎగ్జిక్యూటర్ పి.మోహిని, సామాజిక కార్యకర్త డా..మంత్రి వెంకటస్వామి, లక్ష్మణరావు, జయలక్ష్మి మలేరియా సిబ్బంది, మరియు ఎఎన్ఎంలు, ఆశ వర్కర్‌లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గారు .. పలాస నియోజకవర్గ సమస్యలు ఇవిగో..!

విశాలాంధ్ర- పలాస/మందస : దశాబ్దాల తరబడి సాగునీటి వనరులు అభివృద్ధి చేయకపోవడంతో సాగునీటి కోసం అన్నదాతలు ఆక్రందన చెందుతున్నారు. ఏటా కరువు పరిస్థితులు నెలకొంటున్నాయి. సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ దశాబ్దాలు తరబడి మరమ్మతులు గాని, అభివృద్ధి గాని జరగడం లేదు. దీంతో దిక్కుతోచని పరిస్థితులు పలాస నియోజకవర్గంలో చోటు చేసుకు న్నాయి. దీనికి సంబంధించి వివరాలివి..

మందసలో సాగునీటి వనరుల దుస్థితి

నక్కసాయి వద్ద రిజర్వాయరు నిర్మాణానికి 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే చేసింది. కాని ఇంతవరకు రూపకల్పన జరగలేదు. ఇక్కడ రిజర్వాయరు నిర్మిస్తే 40 గ్రామాల గిరిజనుల భూములకు సాగునీరు అందుతుంది.

1.మందస మండలంలో 12 సునాముది ప్రధాన కాలువలు, 40 పిల్ల కాలువలు ఉన్నాయి. వీటికి దశాబ్దాల తర బడి మరమ్మతులు లేవు. ఈ కాలువలు మరమ్మతులు జరిగితే 6వేల ఎకరాల భూములకు సాగునీరు పుష్కలంగా అందుతుంది.

2 2006లో దేవుపురం వద్ద నిర్మించిన దామోద రసాగరం రిజర్వాయరుకు ఇంతవరకు కుడి, ఎడమ కాలువలు నిర్మించలేదు. రైతాంగం కోరిక ఇంతవరకు నెలరవేరలేదు.

3. డబారుసింగ్ రిజర్వాయర్ ను 1986లో గోపాలసాయి వద్ద నిర్మించినా ఇంత వరకు కుడి కాలువ నిర్మాణం జరగలేదు. దీంతో గిరిజనుల భూములకు సాగునీరు పూర్తిగా అందడం లేదు.

4. సింగపురం సమీపంలో నక్కసాయి వద్ద రిజర్వాయర్ నిర్మాణానికి 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే చేసింది. కానీ ఇంతవరకు రూపకల్పన జరగలేదు.ఇక్కడ రిజర్వాయర్ నిర్మిస్తే 40 గ్రామాల గిరిజనుల భూములకు సాగునీరు అందుతుంది.

05. కళింగ దళ్ రిజర్వాయర్ ప్రధాన కాలువలు, పిల్ల కాలువలకు మరమ్మత్తులు లేక కాలువలు దయనీయంగా తయారయ్యాయి.

6 బెల్లుపటియా వద్ద మహేంద్రతనయ గెడ్డపై నిర్మించాల్సిన ట్రఫ్ ఎక్విడక్టు (దోని) పనులు ప్రారంభం కాలేదు. కోటి రూపాయలతో నిర్మించాల్సిన దోని పనుల కోసం టెండర్లు కూడా ఖరారు అయ్యాయి.

7. మందసలో ఉన్న గోపాలసాగరం, జెన్నాచెరువు, మకరజోల వద్ద ఉన్న సంకుజోడు చెరువు మిని రిజర్వా యరుగా నిర్మించాలన్న డిమాండ్ దశాబ్దాలు తరబడి రైతులు నుంచి ఉంది. కాని రైతుల కల నెరవేరలేదు.

8. ఉద్దానం బాహడ పల్లి సమీపంలో నిర్మించాల్సిన జంతిబంద రిజర్వాయరు నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. గతంలో కోటి రూపాయలకు పైగా నిధులు మంజూరైన, టెండర్ ఖరారైన పనులు జరగటం లేదు.

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో

1. పలాస కాశీబుగ్గ పురపాలక సంఘం పలాస రైల్వే పై ఓవర్ వంతెన ఆసంపూర్తి పనులతో నిలిచిపోయింది.

2. రైతు బంజారు ఏర్పాటు ఈ నాటికీ కలగానే మిగిలి ఉంది.

3. హుధూద్ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి అయిన గత పాలకులు లబ్దిదారులకు అందజేయడంలో విఫలమయ్యారు. టీడీపీ ప్రభుత్వంలోనైనా అర్హులైన వారికి ఇళ్లు అందజేయాలని పేద ప్రజలు ఎదురుచూస్తున్నారు.

4. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రజలు తాగునీరు సమస్యల ఎదుర్కొంటున్నా ఈనాటికి పరిష్కారానికి నోచు కోలేదు. శాశ్విత మంచినీటి పథక ఏర్పాటుకై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

5. జంట పట్టణాల్లో సరైన కాలువ వ్యవస్థ లేక పోవడంతో వర్షాలు కురిస్తే నీరు రహదారులపైనే ప్రవహిస్తుంది. వాటి పరిష్కారానికి మార్గం చూపే విధంగా చర్యలు తీసుకోవాలి.

6. క్రీడాకారులు ఉన్నా స్టేడియం లేకపోవడంతో క్రీడానైపుణ్యత కనిపించడం లేదు. అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి చేయాలి

వజ్రపుకొత్తూరు మండలంలో ..

1. సుదీర్ఘంగా ఉన్న తీర ప్రాంత గ్రామాల్లో శాశ్విత తుఫాన్ రక్షిత భవనాలు ఏర్పాటు చేయాలి.

2. వంకులూరు వద్ద గల రాకాసి గెడ్డపై వంతెన నిర్మాణం చేపట్టాలి

3. టూరిజం శాఖ ఆధ్వర్యంలో అక్కుపల్లి శివసాగర్ బీచ్ ను అభివృద్ధి చేయాలి.

4. పూడి జగన్నాథపురం గ్రామానికి వెళ్లేందుకు అక్కడ ప్రజలు పడవలు ఉపయోగిస్తున్నారు. సముద్రపు పర మీద వంతెన నిర్మించేందుకు పాలకులు ఎన్నోసార్లు హామీలు ఇచ్చారు గాని నేటికీ వారి కల నెరవేరలేదు.

ఈ సమస్యలన్నీ పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు స్వాగతిమిస్తున్నాయి. ఎన్నికల సమయంలో శివారు ప్రాంతాల భూములకు వంశధార ద్వారా సాగునీరు అందిస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఉన్న సమస్యలను తన పదవీకాలంలో కొంతవరకైనా పూర్తి చేస్తే ప్రజల గుండెల్లో నిలిచిపోతారు. భవిష్యత్తులో ఆమె రాజకీయ జీవితాన్ని కూడా గట్టి పునాది ఏర్పడుతుందని ప్రజలు భావిస్తున్నారు. ఆ దిశగా ఆమె చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.